ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 2 ఏప్రిల్ 2025

కొండంత మత్తు

బానిసలవుతున్న యువకులు, కార్మికులు



పెనుకొండలో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. పట్టణంతో పాటు సమీపంలోని పల్లెల్లో సైతం గంజాయి మత్తు పాకుతోంది. ఫలితంగా చాలా మంది యువకులు, వలస కార్మికులు దీనికి అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. కొంత మంది గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వివిధ మార్గాల్లో పెనుకొండకు తీసుకు వస్తూ విక్రయిస్తున్నట్లు సమాచారం. పెనుకొండలో కొంతకాలంగా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

- కర్ణాటక నుంచి దిగుమతి
- ప్యాకెట్లుగా చేసి విక్రయాలు

హిందూపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో పనిచేయడానికి వందల సంఖ్యలో కార్మికులు వస్తుంటారు. ఇదే అదునుగా భావించి గంజాయి విక్రేతలు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని పాన్ షాపులు, బండ్లు, ఆటోలే అడ్డాగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొంత మంది భక్తి ముసుగులో దీన్ని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పెనుకొండ పట్టణంలోని కొండకు ఆనుకొని ఉన్న కొంత మంది గంజాయి వ్యాపారానికి అలవాటు పడ్డారు. కిలో రూ. 25 వేల నుంచి రూ. 35 వేలు పెట్టి తీసుకువచ్చి.. ఇక్కడ కిలో రూ. 70 వేల నుంచి రూ. 80 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేలల్లో ప్రధాన రహదారుల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. కొందరు సిగిరెట్‌లోకి, మరికొందరు బాటిల్‌లో వేసుకొని సేవిస్తున్నట్లు తెలుస్తోంది.



పెనుకొండలో విక్రయిస్తున్న గంజాయి ప్యాకెట్లు

తల్లిదండ్రుల్లో ఆందోళన

పెనుకొండతో పాటు చుట్టుపక్కల కొంత మంది యువత గంజాయికి బానిసలవుతున్నారు. వారి ప్రవర్తనలో మార్పు తెలుసుకొని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. విక్రయదారులు యువతే లక్ష్యంగా గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని కొండకు ఆనుకొని ఉన్న ఒక యువకుడు ఇటీవల విచక్షణ కోల్పోవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించే సమయంలో గంజాయి సేవిస్తున్నట్లు వైద్యులు గుర్తించారు. పట్టణంలోని నడిబొడ్డు ప్రాంతంలో నివాసమున్న డిగ్రీ చదివే విద్యార్థి ఇటీవల గంజాయికి బానిసయ్యాడు. కళాశాలలో మత్తులో ఉన్న విద్యార్థినిని గుర్తించిన గురువులు గంజాయి విక్రయాలపై ఆరా తీశారు. ఓ వ్యక్తి ప్యాకెట్లలతో విక్రయిస్తున్నాడని, 5 గ్రాముల ప్యాకెట్‌ని రూ. 300 దాకా చెల్లించి కొనుగోలు చేస్తున్నాడని తెలిసింది. ఇటీవల ఒక ద్విచక్రవాహనదారుడు గంజాయి సేవించి కర్ణాటక సరిహద్దు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. అతడి వద్ద గంజాయి ప్యాకెట్ ఉండటం చూసి ఎక్కడ కొనుగోలు చేశావని ప్రశ్నించగా.. పెనుకొండ బైపాస్ రోడ్డు వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పాడని తెలిసింది.



కొంత కాలం వరకు ఒడిశా, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయి సరఫరా అయ్యేది. కానీ మన రాష్ట్రంలోని ఆ జిల్లాల్లో గంజాయిపై ఉక్కుపాదం మోపడంతో దిగుమతిదారులు

కర్ణాటక నుంచి....

కర్ణాటకలోని గుల్బర్గా నుంచి పెనుకొండకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది. బెంగళూరు నుంచి కూడా తీసుకువస్తున్నట్లు సమాచారం. ఎక్కువగా రైళ్ల, కొందరు వాహనాల్లో తీసుకువస్తున్నట్లు సమాచారం.

విక్రయాలపై అలసత్వం

పెనుకొండ ప్రాంతంలో గంజాయి క్రయవిక్రయాలు కొంత కాలంగా జరుగుతున్నా ఇప్పటివరకు పోలీసులు పట్టుకున్న దాఖలాలు లేవు. వేరే ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నవారిని పోలీసులు ఆరా తీయగా పెనుకొండలో తీగ ఉన్నట్లు తెలిసింది. ఇక్కడ క్రయవిక్రయాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో కొందరు సిబ్బంది సహకారం ఉన్నట్లు సమాచారం. విక్రయదారులు పోలీసుల చేతులు తడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పెనుకొండలో గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్న వారిపై గట్టి నిఘా పెట్టాం. ఇప్పటికే కొంత సమాచారం ఉంది.

ప్రత్యేక బృందాలతో నిఘా..

ఇందులో ప్రముఖ పాత్ర ఉన్న వ్యక్తులపై ఆరా తీస్తున్నాం. గంజాయి నియంత్రణకు త్వరలో కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై హిందూపురం, పెనుకొండ పోలీసులు సంయుక్తంగా దాడులు చేస్తున్నారు. - **వెంకటేశ్వర్లు, డీఎస్పీ, పెనుకొండ**

ముగిసిన పది పరీక్షలు

సోషల్ పరీక్షకు 240 మంది గైర్హాజరు



సెండాఫ్ చెప్పుకుంటున్న విద్యార్థినులు

కొత్తచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. దీంతో విద్యార్థులు ఒకరికొకరు తమ స్నేహితులకు సెండాఫ్ ఇచ్చుకుంటూ ఒకరికొకరి ఫోన్ నెంబర్లను తీసుకున్నారు. సోషల్ పరీక్షకు 240 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. 104 కేంద్రాలలో రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 21488మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 240 మంది గైర్హాజరు కావడంతో 21, 248 మంది పరీక్షలు రాశారని ఆయన తెలిపారు..దీంతో 98.88 శాతం నమోదైందన్నారు.

1,362 నీటితొట్టెల నిర్మాణం



కప్పలబండలలో నీటితొట్టె నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల దాహాన్ని తీర్చడానికి 1,362 నీటితొట్టెల నిర్మాణం చేపట్టనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. పుట్టపర్తి మండలంలోని కప్పలబండ గ్రామంలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి కలెక్టర్ మంగళవారం భూమి చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టెల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. 15రోజుల్లో నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పండుగల సీజన్ కోసం వేచిచూసినా దక్కని ఫలితం

రేట్లు పెరగకపోగా.. మరింత తగ్గిన వైనం

చెట్లుపైనే మాగి, రాలిపోతున్న చీనీకాయలు

తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

రైతు కంట కన్నీరు..!



చీనీ తోట



చెట్టుపై మాగుతున్న కాయలు

తాడిమర్రి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంట చెట్టుపైనే మాగిపోతోంది. కళ్ల ముందే రాలిపోతోంది. దీనిని చూసి రైతు గుండె తరుక్కుపోతోంది. ధర తక్కువగా ఉండడంతో పండుగల సీజన్ కోసం వేచిచూసిన చీనీ రైతుకు మరింత నిరాశ ఎదురైంది. ధరలు మరింత దిగజారి, చెట్లపైనే కాయలు మాగిపోయి రెండు రకాలుగా రైతు నష్టపోతున్నాడు. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితులు లేవని వాపోతున్నారు.

రూ.40 వేలతో కొంటామన్నా..

మండలంలోని చీనీ రైతులు పంట కోయడానికి సిద్ధంగా ఉన్నా కొనేవారు రాక, ధరలేక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతేడాది ఇదే సమయానికి చీనీ టన్ను రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ధరలు పలికాయి. ఈసారి అందులో సగం కూడా లేదు. పక్షం రోజుల క్రితం టన్ను రూ.40వేలతో పంట కొంటామంటూ వ్యాపారులు ముందుకొచ్చారు. గతేడాది రూ.70వేలు పలికింది కదా అనీ, ఈసారి కూడా ధర పెరుగుతుందని రైతులు పంట విక్రయానికి ముందుకు రాలేదు. మొదట హోలీ పండుగకు ధర పెరుగుతుందని ఆశపడ్డారు. ఆ తరువాత ధర తగ్గినా ఉగాదికి పెరుగుతుందనీ, రంజాన్‌కైనా మంచి రేటు దక్కుతుందని భావించారు. వారు ఊహించిన దానికి విరుద్ధంగా జరిగింది. పండుగల సీజన్‌లో ధరలు పెరగాల్సింది పోయి.. మరింత తగ్గాయి. ప్రస్తుతం టన్ను రూ.23 వేలలోపే పలుకుతోంది. దీంతో రైతులు మరింత నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు మాత్రం పండుగ తరువాత తప్పక పెరుగుతుందని రైతులను నమ్మించారు. వారి మాటలు నమ్మి చెట్టు మీద కాయలు మాగిపోతున్నా రైతులు విక్రయించలేదు. ఇప్పటికిప్పుడు చీనీ కాయలు మంచి ధర పలికి అమ్మినా కోయడానికి దాదాపు 800 నుంచి 1000 టన్నుల కాయలు తాడిమర్రి మండలంలో సిద్ధంగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వేలకు వేల రూపాయలు ఖర్చు చేసి, పంట పండిస్తే చివరికి ధర లేక కాయలు మాగిపోతున్నా ఏమిచేయలేకున్నామని రైతులు వాపోతున్నారు. ఎండ వేడిమి అధికంగా ఉండటంతో కాయలపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా కాస్త ధర పెరిగితే మరింత దెబ్బతినకుండా కాయలు అమ్ముకునే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులు కనిపించట్లేదు.



కిలోపై రూ.10 పెరిగినా రూ.10లక్షలు లాభం

శ్రీనివాసరెడ్డి, రైతు, కునుకుంట్ల



మా తోటలో వంద టన్నులకుపైగా చీనీ దిగుబడి ఉంది. నెలరోజుల తరువాత మరో కోత కోసే అవకాశం ఉంది. కిలోపై కనీసం రూ.10 ధర పెరిగినా రూ.10లక్షలకుపైగా ఆదాయం సమకూరుతుంది. దీంతో వేచిచూశాం. పరిస్థితులు అనుకూలించలేదు.

ఆశగా చూసి.. నష్టపోయాం



చీనీ కాయలు పది రోజుల క్రితమే కోయాల్సి ఉంది. మంచి ధర వస్తుందన్న ఆశతో అలాగే ఉంచుకోవడంతో ఒకవైపు ఎండబెట్ట, మరోవైపు ధర పడిపోవడంతో రెండు రకాలుగా నష్టపోయాం. ఉగాది తరువాత కూడా ధరలు పెరగకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

- లింగారెడ్డి, రైతు, కునుకుంట్ల

వేసవిలోనూ ధర క్షీణించింది

ఐదెకరాల్లో చీనీ పంట పెట్టా. ప్రస్తుతం దిగుబడి బాగా వచ్చినా ధర లేకపోవడంతో నష్టపోతున్నాం. వేసవిలో ధర బాగా పలుకుతుందనుకుంటే అందుకు విరుద్ధంగా మరింత క్షీణించింది.



- రామ్మోహన్, రైతు, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం


ఉపాధికి పంచ ప్రాధాన్యాలు

6

● రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ ● వేసవిలో ఉపయోగకర పనులకు శ్రీకారం

ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

6





మున్సిపల్ చైర్‌పర్సన్‌పై

అవిశ్వాసం

కదిరిలో కదలనున్న వైసీపీ పీఠం..!

24 మంది కౌన్సిలర్ల సంతకాలతో తీర్మానం

నేడు కలెక్టర్‌కు సమర్పించే అవకాశం

కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసాపై అవిశ్వాస తీర్మానానికి తెరలేచింది. అవిశ్వాస తీర్మానంపై 24 మంది కౌన్సిలర్లు సంతకాలు పెట్టారు. దీంతో మున్సిపాలిటీలో వైసీపీ పీఠం కదలడం ఖాయంగా కనిపిస్తోంది. సొంత పార్టీ వారే తిరుగుబావుటా ఎగురవేశారు. రెండేళ్ల క్రితం చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపు రాజకీయాలు కూడా నడిచాయి. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతోపాటు నాలుగేళ్ల పూర్తయ్యే వరకు అవిశ్వాసానికి తావు లేకపోవడంతో కౌన్సిలర్లు మిన్నకుండిపోయారు. రెండున్నర సంవత్సరాల తరువాత చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నా.. దానిని పాటించలేదు. చైర్‌పర్సన్ బేఖాతరు చేసినట్లు వైసీపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. దీంతో చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారికి టీడీపీ సభ్యులు తోడవడంతో చైర్‌పర్సన్‌ను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. ఈమేరకు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం ఇవ్వడానికి బుధవారం వెళ్లనున్నారు. గత నాలుగేళ్లలో పట్టణాభివృద్ధిని చైర్‌పర్సన్ ఏమాత్రం పట్టించుకోలేదని కౌన్సిలర్లు మండిపడుతున్నారు. స్కామ్‌లు, స్కీమ్‌లతో కాలం గడిపేశారని వాపోతున్నారు.

రెండేళ్ల క్రితమే క్యాంపు రాజకీయాలు

చైర్‌పర్సన్‌పై రెండు సంవత్సరాల కిందటే క్యాంపు రాజకీయాలు నడిచాయి. దాదాపు 16 మంది అసంతుష్ట కౌన్సిలర్లు కేరళకు క్యాంపు వెళ్లారు. చైర్‌పర్సన్ రాజీనామా చేయాలనీ, ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాల తరువాత పదవి నుంచి తప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతోపాటు మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి అసంతుష్ట కౌన్సిలర్లను బుజ్జగించారు. దీంతో కౌన్సిలర్లు అధిష్ఠానానికి తలొగ్గి ఇళ్లకు వచ్చేశారు. అప్పటి నుంచి కౌన్సిలర్లలో అసంతృప్తి రగులుతూనే ఉంది. తమకు ప్రాధాన్యత లేదని వాపోతున్నారు. కొంతమంది కౌన్సిలర్లు అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ మారిపోయారు. ఇప్పుడు వాళ్లు, అసంతుష్ట కౌన్సిలర్లు, టీడీపీ సభ్యులు కలిసి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు.

వైస్ చైర్‌పర్సన్ రాజీనామా

కదిరి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. రాజీ నామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్‌కు అందచేశారు. ఎవరి ఒత్తిడీ లేదని, వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.



రాజీనామా పత్రం.. కమిషనర్ చేతికి..



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్మపర్సన్ నజీమున్నీసా (ఫైల్)

24మందితో అవిశ్వాసం

కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 24 మంది చైర్‌పర్సన్ నజీమున్నీసాపై అవిశ్వాస తీర్మానానికి సంతకాలు చేశారు. వైసీపీకి మొత్తం 30 మంది సభ్యులున్నారు. టీడీపీకి ఐదుగురు ఉండేవారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 6కి చేరింది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. దీంతో టీడీపీ బలం కౌన్సిల్‌లో 12కి చేరింది. తాజాగా మరో 12 మంది వైసీపీ కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా సంతకాలు చేశారు. దీంతో అవిశ్వాసానికి కావలసిన మెజార్టీ స్పష్టంగా ఉంది. నాలుగేళ్లలో ఒక్క వార్డులో కూడా అభివృద్ధి పనులు చేయకపోవడమే తమ నిర్ణయానికి కారణమని అసమ్మతి సభ్యులు పేర్కొంటున్నారు. వచ్చిన నిధులన్నింటినీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకోవడంతో అభివృద్ధి పనులకు రూపాయి కూడా వెచ్చించలేని దుస్థితి ఏర్పడింది. చివరకు 15వ ప్రణాళిక సంఘం నిధులు, ఇతర గ్రాంట్లను కూడా ఖర్చు పెట్టకుండా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేసింది. వచ్చిన అరకొర నిధులు కూడా చైర్‌పర్సన్ ఇష్టమొచ్చిన వారికి కేటాయించడంతో మిగిలిన కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దీంతో సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే అసంతుష్ట కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

ఆది నుంచీ అవినీతి ఆరోపణలు..

వైసీపీ మున్సిపాలిటీలో అధికారం చేపట్టినాటి నుంచీ అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి ఊసేలేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్లలో చైర్‌పర్సన్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. చైర్‌పర్సన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆమె బంధువులు మున్సిపాలిటీని ఇష్టారాజ్యంగా వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తుక్కును చైర్‌పర్సన్ భర్త సాదిక్ అక్రమంగా తరలించినట్లు కేసు నమోదైంది. డీజిల్‌లో కూడా పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. పట్టణంలో ఖాళీ స్థలాలకు పన్ను (వీఎల్‌టీ) మొదలుకుని, ఇంటి ప్లాన్ల వరకు మున్సిపాలిటీ సీలు (ముద్ర) కాకుండా మరో చిన్న సీలు ఉంటేనే అమోదించాలని చైర్‌పర్సన్ ఆదేశాలు ఇచ్చినట్లు అప్పట్లో కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. కాంట్రాక్టు పనుల్లో పర్సెంటేజ్‌లు, వేస్ట్ చికెన్ తరలింపు, అక్రమ లేఅవుట్లు, ఇలా ప్రతి దాంట్లో అవినీతికి చైర్‌పర్సన్, ఆమె బంధువులు తెరలేపారని పలువురు కౌన్సిలర్లు ఎన్నోమార్లు కౌన్సిల్‌లో నిలదీశారు. తమ వార్డుల్లో పనులు చేయలేదని పలుమార్లు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని సభ్యులు వాపోతున్నారు. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న సొంతపార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. తీర్మానం కౌన్సిల్‌లో పెడితే వైసీపీ మున్సిపల్ పీఠం కదలడం ఖాయంగా కనిపిస్తోంది.



రైతుకు చింతేనా..?

● రంగు తగ్గిందని పడిపోయిన ధర ● క్వింటాల్‌పై రూ. 7వేల వరకు తగ్గింపు ● గిట్టుబాటు కాలేదని రైతుల ఆందోళన (వివరాలు 6వ పేజీలో....)



ఏమి హాయిలే..

నా డౌటు ఏమంటే..
ఎండకు తట్టుకోలేక
నిండా మునిగాం కదా..?
కొంగా..! నువ్వెందుకు
ముడుచుక్కూర్చున్నావ్..?
గజగజా వణికించే చలి అన్నట్లు..!

(అనంతపురం శివారులోని పండమేరు వంకలో సేదదీరుతున్న ఎనుములు)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ప్రశాంతంగా ఉండనీవా..? ఏమైనా పద్ధతేనా..?

ఇంటికోసం దరఖాస్తు చేసుకోండి

హౌసింగ్ పీడీ శైలజ



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రశ్న: పేదల గృహ నిర్మాణానికి ఉన్న ప్రభుత్వ పథకాలు?

పీడీ: ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉండే పేదలు ఈ పథకాలకు అర్హులు.

ప్రశ్న: కొత్త ఇళ్ల కోసం ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి......?

పీడీ: భార్య, భర్తల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, ఎన్‌పీఐసీకి లింక్ అయిన భార్య బ్యాంకు అకౌంట్ పాసుబుక్, స్థలం పట్టా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుకు అనుసంధానం అయిన ఫోన్ నంబరు, పాన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ఆయా మండల ఎంపీడీఓ, తహసీల్దార్, హౌసింగ్ ఏఈలు సభ్యులుగా ఉండే మల్టీ డిసిప్లెన్ టీం పరిశీలన చేసిన అనంతరం పీడీ కార్యాలయానికి పంపుతారు. ఆసక్తి, అర్హతగల సొంత స్థలం ఉండే వారు హౌసింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఎంత మొత్తం చెల్లిస్తారు.....?

పీడీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి రూ.2.5లక్షలు చెల్లిస్తారు. ఇందులో ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మొత్తాన్ని అందిస్తారు.

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని లే అవుట్లలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు? ఎన్ని పూర్తి చేశారు ?

పీడీ: 2019-24 మధ్య కాలంలో జిల్లాలో 412లే అవుట్లలో 41,351ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 13,472ఇళ్లు పూర్తి చేశారు. మిగిలిన 27,878ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ప్రశ్న: వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల పరిస్థితి ఏమిటి...?

పీడీ: గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీంతో లబ్ధిదారులను చైతన్యం చేసి అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు సాయం ఎంతమందికి, ఎంత అందజేశారు....?

పీడీ: మొదటి విడతలో 6080మంది లబ్ధిదారులకు రూ.9.11కోట్లు నిధు లు మంజూరు చేశారు. ఇప్పటికే 4వేల మంది లబ్ధిదారులకు రూ.5.94కోట్లు వారి ఖాతాల్లో జమచేశారు. అయితే సొమ్ము పడిన లబ్ధిదారులను చైతన్యం చేసి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని ఇంజనీర్లకు సూచించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న 17 అధ్యాపక పోస్టుల్లో డెప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎంఈఓలు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన, 58 సంవత్సరాల వయసువారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 16, 17 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 17న ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9949993712 నంబరులోగానీ, డీఈఓ కార్యాలయంలోగానీ సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

మార్కెట్‌కు వచ్చిన చింత పండు →



- రంగు తగ్గిందని పడిపోయిన ధర
- క్వింటానికి రూ.7వేల వరకు తగ్గింపు
- గిట్టుబాటు కాలేదని రైతుల ఆందోళన

రైతుకు చింతేనా..?



ఈ ఏడాది పంట నష్టమే



ఒకే చెట్టులోని చింత పండు మూడు వారాలుగా తీసుకు వస్తున్నా. మొదటి వారం రూ. 22 వేలు, రెండో వారం రూ. 20 వేలు, గురువారం రూ. 16 వేలు ధర పలికింది. ఈ లెక్కన క్వింటాల్‌పై ఐదారు వేల వరకు నష్టపోయాను. దీనికి తోడు కూలీలు రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చింతపండుకు ధర నిర్ణయిస్తే తప్పా భవిష్యత్తులో చింత రైతులకు మిగిలేదు ఏమీ ఉండదు.

- గోవిందప్ప, శిర మండలం

హిందూపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చింత ధరలు పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న చింత పండు ధరలు వారం వారం తగ్గుతూ వస్తున్నాయి. మార్కెట్ ప్రారంభంలో ఆశించిన మేర ధరలు పలికాయి. మార్చిలో మరింత ధర పెరుగుతుందని రైతులు ఆశించారు. కానీ ఫిబ్రవరి, మార్చి ఆఖరికి ధరలతో పోల్చితే మేలురకం కర్పూళి క్వింటాల్‌పై రూ. 7 వేల దాకా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున చింతపండు వస్తుంది. ఇక్కడికి కర్పూళి రకం ఎక్కువగా వస్తుంది. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 1700 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనధికారికంగా సుమారు 4 వేల క్వింటాళ్ల వరకు వచ్చినట్లు అంచనా. మేలు రకం కర్పూళి క్వింటాల్ రూ. 27 వేలు పలికింది. రెండో రకం రూ. 13 వేలు, మూడోరకం రూ. 8,100 పలికాయి. మార్కెట్‌కి వచ్చిన ఫ్లవర్ రకంలో మొదటిది రూ. 12,500, రెండోది రూ. 7500, మూడోరకం రూ. 4,500 పలికాయి. ఇదే చింతపండు మార్చి 10న మేలు రకం క్వింటాల్ ధర రూ. 40 వేలు, 12న రూ. 33 వేలు పలికింది. ఫిబ్రవరి నెలలో మేలు రకం రూ. 33 వేలు, రెండో రకం రూ. 15 వేల దాకా పలికాయి. ఈ లెక్కన క్వింటాల్‌పై రూ. 7 వేలకు పైగానే ధరలు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు.

రంగు తగ్గిందని..

సాధారణంగా మార్చి నెలలో చింతపండు రంగు బాగుంటుంది. అకాల వర్షాల కారణంగా కొంత వరకు రంగుమారింది. దీనిని సాకుగా చూపి క్వింటాల్‌కు రూ. 7 వేల దాకా ధర తగ్గించడం అన్యాయమని రైతులు వాపోతున్నారు. బయటి వ్యాపారులు రాలేదంటే స్థానిక వ్యాపారులే కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవాల్సి వచ్చింది. మార్చి నుంచి ఏప్రిల్ 15 వరకు చింత పండు నాణ్యంగా ఉంటుంది. ఈ సమయంలో రంగు బాగా ఉంటుంది. కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచుతారు. అనంతరం కర్నూలు, విజయవాడ, నెల్లూరు, చిత్తూరు తమిళనాడు ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి నిల్వ చేస్తారు. ఈసారి బయటి వ్యాపారులు రాలేదని తెలుస్తోంది.

ఆలస్యంగా మార్కెట్ ప్రారంభం

సాధారణంగా ప్రతి ఏడాది జనవరి నెలలోనే చింతపండు మార్కెట్‌కి వస్తుంది. కానీ ఈసారి ఫిబ్రవరి 2వ తేదీ మార్కెట్ ప్రారంభించారు. మార్చిలో ధరలు తగ్గడం వెనక కారణాలు ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా తక్కువ సరుకు ఉన్న రైతులు ఉగాది పండుగ ముందు వారంలో మార్కెట్‌కి తీసుకువచ్చి విక్రయిస్తారు. ఈసారి మార్చి 15 తరవాత వచ్చిన రైతులకు చింతే మిగిలింది.

కూలి కూడా గిట్టదు

ప్రస్తుతం చింత చెట్టు నుంచి కాయలు కోయాలంటే ఒక్కో కూలికి రూ. 1000 నుంచి రూ. 1200 ఇవ్వాలి. కాయలు ఏరేందుకు మహిళలకు రూ. 500 కూలి ఇవ్వాలి. కోసిన చింతకాయను కట్టికాయ చేయడానికి కూలికి రూ. 700 ఇవ్వాలి. కట్టి కాయను కర్పూళి చేసేందుకు కిలోకి రూ. 30 ఇవ్వాలి. ఇలా కూలీలు లెక్కిస్తే రైతుకి గానీ, చింతచెట్టు కొనుగోలు చేసిన వారికి కానీ మిగిలేదేమీ ఉండదు. ఈసారి అనుకున్న రీతిలో చింత ఫలసాయం అందలేదు. సాధారణంగా కొన్ని చింత చెట్ల నుంచి తెచ్చిన 10 కిలోల కట్టి కాయను కొడితే 6 నుంచి 7 కిలోలు వచ్చేది. ఇప్పుడైతే 5 నుంచి 5.5 కిలోలకే పడిపోయింది. దీనివల్ల 10 కిలోల కట్టి కాయకు 300 దాకా నష్టం వస్తుంది. మార్కెట్‌కు తీసుకెళితే మార్కెట్ కూలీలు, కమీషన్లు లెక్కిస్తే రైతులకు మిగిలేదేమీలేదు. చింతపండుతో ఈసారి నష్టమే తప్పా లాభం లేదు.

రెండువారాల్లో రూ. 7 వేలు తగ్గింది



రెండు వారాల క్రితం హిందూపురం మార్కెట్‌కి కర్పూళి రకం తీసుకు వస్తే రూ. 23 వేలు పలికింది. అదే చెట్టులోని కాయ గురువారం రూ. 16 వేలు పలికింది. ఈ లెక్కన క్వింటాల్‌కి రూ. 7 వేలు తగ్గింది. దీంతో లాభం వచ్చే పరిస్థితి లేదు. ఇలా అయితే చింత చెట్టు దులుపడం కూడా మానేయాలి.

- సూలప్ప, రైతు, గుడిబండ

ఆనందమానంద మాయె..!

ముగిసిన పది పరీక్షలు



బడి జీవితం ముగిసింది.. ఇక కాలేజీలో కలుద్దాం నేస్తం..





ఉపశమనం.. ఎండ నుంచి.. పరీక్షల నుంచి..

పది పరీక్షలు ముగిశాయి. ఇన్నాళ్లూ పుస్తక ప్రపంచంలో మునిగి తేలిన విద్యార్థులు హాయిగా.. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నారు. అందరి ముఖాలు ఆనందంతో వికసించాయి. బడి దాటి.. కాలేజీ కాంపౌండ్‌లోకి అడుగుపెట్టబోతున్న అందరూ.. ఇన్నాళ్లూ కలిసి చదివిన తమ ఆత్మీయ మిత్రులతో సెల్ఫీలు దిగారు. షేక్ హ్యాండ్ ఇచ్చుకుని వీడ్కోలు చెప్పుకున్నారు. అనంతపురంలోని హాస్టళ్లలో ఉంటున్నవారు పెట్టే బేడ సర్దుకుని ఇంటి బాట పట్టారు. వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ప్రైవేటు, కార్పొరేట్ రెసిడెన్షియల్ పాఠశాలల వద్ద సందడి కనిపించింది.

400 మంది గైర్హాజరు

పదో తరగతి పరీక్షల చివరి రోజు సోషల్ పరీక్షకు 400 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 30,997 మందికిగాను 30,638 మంది పరీక్ష రాశారు. ప్రైవేట్ విద్యార్థులు 203 మందికిగాను 162 మంది హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ 32 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 7 కేంద్రాలను తనిఖీ చేశాయి. గత నెల 17న మొదలైన పరీక్షలు ముగియడంతో అధికారులు స్పాట్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య



పదో సెల్ఫీ



మోసేంత బరువు.. ఇక ఇంటికి..



ఇక పదమ్మా...

ఉపాధికి పంచ ప్రాధాన్యాలు

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- వేసవిలో ఉపయోగకర పనులకు శ్రీకారం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఐదు ప్రాధాన్యాలతో ఉపాధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డ్వామా పీడీలకు పలు సూచనలు చేసింది. ఇందులో ప్రధానంగా పశువుల నీటి తొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, ఫాంపాండ్లు, సగటు వేతనం, ఫీడర్ చానల్ నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది.

పశువుల నీటి తొట్టెలు

వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో 646 నీటి తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏప్రిల్ 10 నాటికి నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేసి పైపులైన్ ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తి తీర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.



పశువుల నీటి తొట్టెలు

చెరువుల పునరుద్ధరణ

గ్రామానికి, రోడ్లకు సమీపంలో ఉన్న చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మండలంలో 5 ఎకరాలలోపు ఉండే రెండు చెరువులను ఇలా గుర్తించి అందంగా తయారు చేయనున్నారు. మొదటి మూడు నెలల్లో కనీసం 31చెరువులు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఫాంపాండ్ల నిర్మాణం

ప్రతి రైతు పొలంలో సేద్యపు నీటి కుంటలను నిర్మించాలని సంకల్పించారు. జిల్లాకు 9వేలు లక్ష్యంగా నిర్ణయించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఈ ఫాంపాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఫాంపాండ్లలో నీటిని నిల్వ చేసుకుంటే భూగర్భ జలాల పెరగడంతోపాటు పశువులకు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఏప్రిల్ నెలలో 4500, మే నెలలో 2700, జూన్‌లో 1800ఫాంపాండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఫీడర్ చానల్ పునరుద్ధరణ

జిల్లాలో సాగునీటి కాలువల్లో పూడిక తీత చేపట్టి రాబోయే పంట సమయానికి ఆయకట్టు చివరి పొలం వరకు సాగునీరు అందేలా ప్రతి కాలువను పునరుద్ధరించాలి. జిల్లాలో మొదటి దశలో 93 కిలోమీటర్ల ఫీడర్ చానల్ కాలువ పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు.

ఉపాధి కూలీకి సగటు వేతనం




ఉపాధి హామీ కూలీలకు సగటున దినసరి వేతనం రూ.300 పొందేలా గ్రూపు మార్కింగ్ ఇచ్చి కనీసం 5గంటలు పని ప్రదేశంలో ఉండాలని నిర్దేశించారు. ఇందుకు కూలీలకు, మేట్లకు కనీస అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి పథకం సిబ్బందిపై ఉంది.

జిల్లాకు మేలు

ఉపాధి హామీ పథకంలో పంచ ప్రాధాన్యాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పలు ఆదేశాలు ఇచ్చింది. కలెక్టర్ నేతృత్వంలో ఉపాధి పథకాన్ని జిల్లాలో పటిష్ఠంగా అమలు చేస్తాం. ఈక్రమంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువుల నీటితొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, ఫాంపాండ్ల నిర్మాణం, ఉపాధి కూలీకి సగటు వేతనం, ఫీడర్‌చానల్ నిర్మాణం చేపట్టాలి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీటి సదుపాయం, రైతులకు మేలు, ఉపాధి కూలీలకు కనీస వేతనం పెంపునకు పంచప్రాధాన్యాలు తోడ్పడతాయి.

- సలీంబాషా, డ్వామా పీడీ



చెరువుల పునరుద్ధరణ ఇలా

అవమానించారని ఆత్మహత్య


ఓబిరెడ్డి (ఫైల్)

కనగానపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తగరకుంటలో ఓబిరెడ్డి(32) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తగరకుంట, కేకే తండాకు చెందిన కొందరు అవమానించినందుకే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఓబిరెడ్డి తండ్రి సుబ్బిరెడ్డి, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓబిరెడ్డి ఎంబీఏ మధ్యలో మానేసి తండ్రికి తోడుగా వ్యవసాయ పనులు చేసేవాడు. తల్లిదండ్రులు గ్రామ శివారులోని ఆవులషెడ్‌లో ఉంటున్నారు. ఓబిరెడ్డి తగరకుంటలోని ఇంటిలో ఉండేవాడు. ఓబిరెడ్డిని కలిసేందుకు మంగళవారం ఉదయం అతని స్నేహితులు వెళ్లారు. అప్పటికే ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వారు డయల్ 100 ఫోన్ చేసి విషయం తెలియజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఐపీఎల్ బెట్టింగ్ బాగా జరుగుతోంది. దీంతో ఓబిరెడ్డి ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

మద్యానికి బానిసై..

తాడిపత్రి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లిలో చిన్నవజీర్ (22) అనే యువకుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్న వజీర్.. మద్యానికి బానియ్యాడని, పనులు లేకపోవడంతో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె-తాటిచెర్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందారని రైల్వే ఎస్‌ఐ వెంకటేష్ మంగళవారం తెలిపారు. అతని వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. యాదగిరి నుంచి యశ్వంతపూర్ వెళ్లడానికి కొనుగోలు చేసిన జనరల్ టిక్కెట్ లభించిందని తెలిపారు. పసుపు రంగు టీ షర్టు, లైట్ సిమెంట్ కలర్ ప్యాంటు ధరించాడని తెలిపారు. ఎడమచేతికి పి.మహి అని పచ్చబొట్టు వేయించుకున్నాడని, కుడి చేతిపై ఎంఎస్ అని ఉందని అన్నారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు.

బావను చంపిన బావమరిది


మృతి చెందిన నారాయణ

సోమందేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇంట్లో తనకంటే అల్లుడికే ప్రాధాన్యం ఇస్తున్నారని గొడవపడిన కొడుకు.. తన బావను కర్రతో కొట్టి చంపేశాడు. ఈ సంఘటన సోమందేపల్లి పట్టణంలోని సాయినగర్‌లో చోటు చేసుకుంది. ఉగాది పండుగకు తన భార్యతో కలిసి నారాయణ(35) అత్తవారింటికి వచ్చాడు. బావమరిది మారితో కలిసి మంగళవారం మద్యం సేవించాడు. ఇంట్లో కొడుకుల కంటే అల్లుడికే ప్రాధాన్యం ఇస్తున్నారని తల్లితో మారి గొడవపడి, ఆమెపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన తన అన్న అంజి, బావ నారాయణపై కర్రతో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

చైన్‌స్నాచర్ బరితెగింపు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ చైన్‌స్నాచర్ బరితెగించాడు. పింఛన్ల పంపిణీకి స్కూటర్‌పై వెళుతున్న 71వ సచివాలయ ఉద్యోగి శకుంతలను అటకాయించి, మెడలో బంగారు గొలుసు తెంచుకుపోయాడు. హెచ్చెల్సీ పక్కనున్న దారిలో వెళుతున్న ఆమెను అగంతకుడు బైక్‌లో వెంబడించాడు. హఠాత్తుగా తన బైక్‌ను ఆమె స్కూటర్‌కు అడ్డుపెట్టాడు. ఆమె కింద పడగానే మెడలోని బంగారు గొలుసు తెంచే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో గొలుసు తెగిపోయింది. మూడున్నర తులాల గొలుసులో ఆమె వద్ద రెండుతులాలు మిగిలిపోగా.. ఒకటిన్నర తులంతో దొంగ పరారయ్యాడు. శకుంతలకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 90 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 26వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,530 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 746 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచానపల్లిలో రెండురోజుల క్రితం ఎద్దు పొడిచి తీవ్రంగా గాయపడిన గాజుల సుబ్బమ్మ (70) అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందారు. ఇంటి వద్ద సుబ్బమ్మ పేడ తీస్తుండగా ఎద్దు పొడిచింది. బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

అప్పు తీర్చేందుకు హత్య

- యూ ట్యూబ్ చూసి ప్రణాళిక
- మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- నాలుగు నెలల తరువాత వెలుగులోకి వ్యవహారం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ తదితరులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పొరుగింట్లో ఉన్న మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు ఆమె బంగారంపై కన్నేశాడు. హత్య ఎలా చేయాలో యూ ట్యూబ్‌లో చూసి తెలుసుకున్నాడు. ఆమెను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కడతేర్చాడు. మడకశిర మండలం ఉగ్రేపల్లి అటవీ ప్రాంతంలో నాలుగు నెలల క్రితం జరిగిన ఈ హత్య కేసును ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని, సీఐ రాజ్‌కుమార్ ఛేదించారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని మంగళవారం కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. కదిరేపల్లికి చెందిన బి.నరసింహమూర్తి పావగడ నియోజకవర్గంలోని అరసికెరెకు చెందిన ఉమాదేవితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఉమాదేవి బెంగళూరులో ఓ గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న సమయంలో నరసింహమూర్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో అప్పుల్లో ఉన్న నరసింహమూర్తి కన్ను ఉమాదేవి వద్ద ఉన్న బంగారంపై పడింది. ఉమాదేవి అరసికెరెలో ఉండగా నరసింహమూర్తి ఫోన్‌చేసి కదిరేపల్లికి రమ్మన్నాడు. అప్పటికే యూట్యూబ్ ద్వారా మహిళను ఎలా హత్యచేయాలలో తెలుసుకుని, అవసరమైన తాడును సిద్ధం చేసుకున్నాడు. మడకశిరకు వచ్చిన ఆమెను ఉగ్రేపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ తాడుతో చేతులను కట్టేసి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే పూడ్చి, ఆధారాలు లేకుండా చేసి, బెంగళూరుకు వెళ్లిపోయాడు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గత నెల 15న గుర్తించారు. అప్పటికే అరసికెరెలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో ఉమాదేవి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహం కాళ్లకు ఉన్న పట్టీలు, ఇతర ఆనవాళ్లను వారు గుర్తించారు. ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసింది. ఉమాదేవికి చెందిన బంగారు మంగళసూత్రం గొలుసు, కమ్మలు, ముక్కుపుడుక తదితర ఆభరణాలను నిందితుడు కుదువపెట్టి డబ్బు తీసుకున్నట్లు విచారణలో తేలింది. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్య హత్య కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన మజ్జిగ లింగమయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, రామగిరి సీఐ శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మజ్జిగ లింగమయ్య కుమారుడు మనోహర్ మార్చి 30న తన అత్తగారి ఇంటికి వెళుతుండగా ఆదర్శ్, అతని అనుచరులు హేళన చేశారు. ఈ విషయాన్ని మనోహర్ తన తండ్రి లింగమయ్యకు ఫోన్ చేసి తెలియజేశాడు. లింగమయ్య వారిని ప్రశ్నించడంతో ఆదర్శ్, మనోజ్ నాయుడు కట్టెలతో దాడి చేశారు. దీంతో లింగమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన చిన్న కుమారుడు శ్రీనివాసులు గాయపడ్డాడు. లింగమయ్యను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. లింగమయ్య భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామగిరి శివారులోని 11 కేవీ కరెంటు ఆఫీసు వద్ద ఉన్న ఆదర్శ్, మనోజ్ నాయుడును అరెస్టు చేశారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి

రైల్వే డీసీఎం శ్రీకాంత్ రెడ్డి



ధర్మవరం రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాలను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

అనంతపురం న్యూటౌన్/ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం, ధర్మవరం రైల్వే స్టేషన్‌లలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని డివిజన్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. రెండు ప్రాంతాలలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో 53 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో 17 రైల్వే స్టేషన్లలో రూ.446 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతపురం స్టేషన్‌కు రూ.29 కోట్లు ఇచ్చారని తెలిపారు. తొలివిడతలో రూ.10 కోట్ల పనులు ప్రారంభించామని తెలిపారు. బుకింగ్ కౌంటర్, టి స్టాల్, క్లోక్ రూం, ఫుడ్ కోర్ట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. సెప్టెంబరులో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ధర్మవరం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కోసం రూ.7.50 కోట్లు కేటాయించారని, తొలి విడత రూ.3.50 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. ధర్మవరం స్టేషన్‌లో ప్లాట్‌ఫాం, విశ్రాంతి గది, బుకింగ్ కౌంటర్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్లాట్‌ఫాం వద్ద డ్రైనేజీ నీరు బయటకు వస్తోందని, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని రైల్వే డివిజన్ కమిటీ సభ్యుడు భీమనేని ప్రసాద్ నాయుడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్టేషన్ మేనేజర్‌లు అశోక్‌కుమార్, చల్లా నరసింహనాయుడు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, సీనియర్ సెక్షన్ సివిల్ ఇంజనీర్ ఉమేశ్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బాబూజీరావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ హరి కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పరిహారం రూ.5 లక్షలు

వినియోగదారుల న్యాయస్థానం తీర్పు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని విద్యుత్ శాఖను ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం.శ్రీలత మంగళవారం తీర్పునిచ్చారు. అనంతపురం నగర శివారులోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన సామలూరు పుల్లయ్య కడప జిల్లా పులివెందులలో కూలి పనికి వెళ్లి 2022 డిసెంబరు 15 విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే నెల 18న మృతి చెందాడు. ఈ ఘటనపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పుల్లయ్య భార్య యశోద కడప జిల్లా విద్యుత్ శాఖాధికారులను సంప్రదించి పరిహారం కోరారు. పుల్లయ్య తన నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్నారని, తమకు ఎలాంటి బాధ్యత ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తేలిపోయారు. లీగల్ నోటీసు పంపినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలు అనంతపురం జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నోటీసులు స్వీకరించిన విద్యుత్ శాఖ అధికారులు, కమిషన్ ఎదుట హాజరై 11కేవీ లైన్‌లకు సంబంధించి మాత్రమే తమకు బాధ్యత ఉంటుందని, వ్యక్తి నిర్లక్ష్యం కారణంగా మృతి చెందితే యజమానికి బాధ్యత ఉంటుందని వాదన వినిపించారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం, పరిహారాల నిబంధనలను అనుసరించి బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. సేవాలోపానికి రూ.10వేలు, మనోవేదనకు రూ.10వేలు, ఖర్చులకు రూ.3 వేలు 45 రోజుల్లోగా చెల్లించాలని అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్ మేరీ ఆదేశించారు. పుల్లయ్య తల్లికి, భార్యకు, ఇద్దరు కూతుళ్లకు రూ.5 లక్షల పరిహారం సమానంగా చెందాలని ఆదేశించారు. కూతుళ్లకు చెందే వాటాను మైనార్టీ తీరేదాకా జాతీయ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉంచాలని, దానిపై వడ్డీ, కమిషన్ ఆదేశించిన ఖర్చులు మృతుడి భార్యకు చెందాలని తీర్పులో పేర్కొన్నారు.

నిరీక్షణ ఫలించేనా..?

- నామినేటెడ్ పదవులపై ఆశలు
- ఆలయాలు, మార్కెట్ యార్డులు సహా పలు పోస్టులు ఖాళీ
- రాష్ట్ర స్థాయి పోస్టులపై కొందరి గురి
- ఇప్పటి వరకూ కదిరికి దక్కని చోటు



కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల ప్రకటన వెలువడినప్పుడల్లా.. జాబితాలో తమ పేరు ఉంటుందేమోనని ఎదురు చూస్తున్న కదిరి నియోజకవర్గ నాయకులకు నిరీక్షణే మిగులుతోంది. ఇప్పటి వరకూ రాష్ట్ర స్థాయిలో ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో కదిరికి ఒక్క డైరెక్టర్ పదవి కూడా దక్కలేదు. మూడో విడత నామినేటెడ్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం జాబితాలు సిద్ధం చేస్తుండడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో చైర్మన్, డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రసిద్ధిగాంచిన ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతోపాటు కదిరి, తనకల్లు మార్కెట్‌యార్డులు కూడా ఖాళీగానే ఉన్నాయి. వీటి భర్తీ కోసం నాయకులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోస్టులకు కూడా కొంతమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మరింత ఊపు వస్తుందని నాయకులు భావిస్తున్నారు.

నాయకుల ఎదురుచూపు

నామినేటెడ్ పోస్టుల భర్తీ ఊరిస్తూనే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచిపోయింది. రెండు విడతలు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా.. కదిరి ప్రాంతానికి డైరెక్టర్ పోస్టులు కానీ, చైర్మన్ పోస్టు కానీ ఒక్కటి కూడా దక్కలేదు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు ఈ పదవులపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవులు భర్తీ అయితే తమకు స్థానాలు దక్కుతాయని ఆశతో ఉన్నారు. కనీసం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో డైరెక్టర్ పోస్టులు దక్కినా తమకు గౌరవం ఉంటుందని భావిస్తున్నారు.

చైర్మన్, డైరెక్టర్ పోస్టుల ఖాళీ

కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంస్థలకు చైర్మన్, డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో ఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ముఖ్యంగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్, కమిటీ సభ్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గడిచిన బ్రహ్మోత్సవాలకు ముందే ఈ పోస్టులు భర్తీ అవుతాయని అందరూ ఆశించారు. కొన్ని కారణాల వల్ల వీటి భర్తీని ఆపినట్లు సమాచారం. చైర్మన్ పోస్టుకు తీవ్రమైన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ సామాజిక వర్గాల నుంచి పోటీ పడుతున్నట్లు సమాచారం. కదిరి మార్కెట్‌యార్డును బీసీ జనరల్‌కు రిజర్వ్ చేయడంతో దానిపై అప్పటి వరకు ఆశలు పెట్టుకున్న తలుపుల మండలంలోని ఇద్దరు నాయకులు, కదిరి మండల నాయకులకు నిరాశే మిగిలింది. చైర్మన్ పదవి దక్కకపోయినా.. వైస్ చైర్మన్ పదవైనా తమకు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను పట్టుబడుతున్నట్లు సమాచారం. తనకల్లు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆ వర్గాల నుంచి ప్రధానంగా ముగ్గురు పోటీ పడుతున్నట్లు తెలిసింది. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం, ఎర్రదొడ్డి గంగమ్మ దేవస్థానం, తవళం ఆంజనేయస్వామి ఆలయంతోపాటు పాటు చిన్న చిన్న ఆలయాలకు కూడా చైర్మన్, కమిటీ సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. వీటిని ఏప్రిల్‌లో భర్తీ చేస్తారని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి ఇటీవల ఆదాయం భారీగా పెరిగింది. ఆ చైర్మన్ స్థానానికి రూరల్ మండల నాయకులతోపాటు కుటాగుళ్లకు చెందిన పలువురు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి పోస్టులపై గురి

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పోస్టులపైన స్థానికంగా ఉన్న కొందరు నాయకులు ఆశలు పెట్టుకున్నారు. మైనార్టీ నాయకులు, పాల ఏకరులతోపాటు పలువురు కులవృత్తులకు సంబంధించిన కార్పొరేషన్లలో తమకు చైర్మన్, డైరెక్టర్ పోస్టులు దక్కుతాయని ఆశతో ఉన్నారు. ఉగాది సందర్భంగా జరిగే మూడో విడతలోనైనా తమ పేర్లు ప్రకటిస్తారని ఎదురు చూస్తున్నారు. ఉగాది నాడు ఎంతమందికి తీపి కబురు అందుతుందో వేచి చూడాల్సిందే.

దేశంలోనే అత్యధిక పింఛన్ అందిస్తున్న రాష్ట్రం ఏపీ: మంత్రి సవిత


పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధిక పింఛన్ సొమ్ము అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలో ఇంటింటికీ వెళ్లి మంత్రి మంగళవారం పింఛన్ సొమ్ము అందించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.63 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు రూ.2,717 కోట్ల పింఛన్ సొమ్ము ప్రతినెలా అందిస్తున్నామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు 1వ తేదీన పింఛన్ ఇస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటున్నామన్నారు. త్వరలో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వర్షాలు వచ్చేలోగా పూర్తి చేయండి

- ప్రతి రైతూ ఫాం పాండ్స్ తవ్వించుకోవాలి
- జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వర్షాలు వచ్చేలోపు ఫాం పాండ్స్ పనులు పూర్తి చేయాలని డ్వామా అధికారులను జిల్లా ప్రత్యేక అధికారి, ఐఏఎస్ హరినారాయణ ఆదేశించారు. రాంపురం పంచాయతీలో ఉపాధి పనులను జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అంతకుమునుపు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పంటలను కాపాడుకునేందుకు ఫాం పాండ్స్ ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి రైతు తమ పొలంలో ఫాం పాండ్స్ తవ్వించుకోవాలని సూచించారు. ఆ నీటిని వ్యవసాయానికి, పశువులకు, చేపల పెంపకానికి వాడుకోవచ్చని అన్నారు. మాజీ సర్పంచ్ నరసింహులు పొలంలో తవ్విన ఫాం పాండ్‌ను ఆయన పరిశీలించారు. గ్రామంలో గోకులం షెడ్‌లను పరిశీలించారు. పశువుల నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పెనుకొండ ఆర్డీఓ కార్యాలయంలో మధ్యాహ్నం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఉపాధి హామీ పథకం పీడీ నరసయ్య, సిరికల్చర్ ఏడీ పద్మావతి పాల్గొన్నారు.

సమస్యలను నిర్భయంగా తెలపండి


ఈదుల బళాపురంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న హరినారాయణ

సోమందేపల్లి: ప్రభుత్వ పథకాలు అందడంలో ఇబ్బందులుంటే ప్రజలు నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ సూచించారు. ఈదుల బళాపురంలో పింఛన్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. గ్రామంలో 52 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతి నెలా పింఛన్‌లు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వెంకటేశులు అనే లబ్ధిదారు నిర్మించుకున్న మినీ గోకులాన్ని సర్పంచ్ రామక్క ప్రారంభించారు. అనంతరం పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం శివారులో బావిలో పడి గొర్రెల కాపరి రామాంజనేయులు(30) మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్లకు చెందిన రామాంజనేయులు గొర్రెలను తీసుకొని కసాపురం శివారులోని బావి వద్దకు వచ్చాడు. బావిలోనీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిఉంటాడన్నారు. గమనించిన స్థానికులు బావిలో నుంచి బయటకు తీయగా అతడు అప్పటికే మృతి చెందాడని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కసాపురం పోలీసులు తెలిపారు.

అభయాంజనేయస్వామి దేవాలయంలో చోరీ

గుత్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని బీసీ కాలనీలో అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం చోరీ జరిగింది. హుండీలో ఉన్న రూ.20వేలు అపహరించారు. ఉగాది పండుగను పరస్కరించుకొని దేవాలయంలో అర్చకులు పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం వచ్చి చూడగా ఆలయంలో ఉన్న హుండీని తెరచిఉండటాన్ని గమనించిన అర్చకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్రామీణ వీధులన్నీ మట్టి రోడ్లే

• కాలువల్లేక కదలని మురుగు • సీసీ రోడ్లు వేయించాలని గ్రామస్థుల వినతి



నల్లమాడలో సీసీరోడ్లు లేని బీసీ కాలనీ



చౌటకుంటపల్లిలో సీసీ రోడ్డు లేని దృశ్యం

నల్లమాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సమస్యలు తిష్టవేశాయి. గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లోని సమస్యలను, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చే సింది. ఆ ప్రభుత్వం రూపాయి కూడా సర్పం చ్‌లకు ఇవ్వక పోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకపోయాయి. ఇక అభివృద్ధి పనులు ఏ ఒ క్కటి చేపట్టలేదు. వీధుల్లో మట్టి రోడ్లు ఉన్నాయి. మురుగు కాలువలు లేక పోవడంతో ఆ వీధుల్లోనే మురుగు ప్రవహి స్తోంది. మట్టిరోడ్ల గుంతల్లో ఆ నీరు నిల్వ ఉండ టంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలో నల్లమాడలోని బీసీ కాలనీలో, అక్కమ్మగారివీధి, ఎస్సీ కాలనీ, చేనేత కాలనీ, హమాలీ క్వార్టర్స్‌తోపాటు గంగాపురం, రాగా నిపల్లితండా, కురమాల, మసకవంకపల్లి, మూల పృగారిపల్లి, సుబ్బరాయునిపల్లి, గూడ మేకల పల్లి, చౌటకుంటపల్లి, కాయలవాండ్లపల్లి, బొగ్గిటివారిపల్లి, ఎర్రచెరువుపల్లి, బాపకుంట, మీసాలవాండ్లపల్లి, సీకివారిపల్లి, వేళ్లమద్ది, రెడ్డికుం టతండా, కొండకిందతండా, తిప్పయ్యగారిపల్లి తదితర గ్రామాల్లో చాలా వీధుల్లో మట్టి రోడ్లే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా.. సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెన్స్ వర్క్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం బండ్లపల్లి, గురువారం తలమర్ల, శుక్రవారం కొత్తచెరువు, శనివారం కేశాపురం సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడువు ముగిసినా సుంకం వసూళ్లు

కొత్తచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక దినపు సంత, బస్టాండ్‌కు సంబంధించి సుంకం వసూళ్లు చేయడానికి వేలం పాటదారులకు మార్చి 31వ తేదీతో గడువు పూర్తి అయింది. వారు మంగళవారం కూడా సుంకం వసూళ్లు చేపట్టారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండిపడినట్లైంది. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. ఈ వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో వారికి కూడా ఈ అక్రమ సుంకం వసూళ్లలో.. వాటాలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరికి బుధవారం నుంచి పాలిసెట్ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30న పాలిసెట్ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షకు ధర్మవరం పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. పాలిసెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా కాలంలో స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కార్తీక్ నాయక్

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారుడు కార్తీక్‌నాయక్ ఎంపికైనట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోషియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు కాకనాడ జిల్లా పిఠాపురంలో జరిగిన ఉమ్మడి బాలుర బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు తరఫున పాల్గొన్న కార్తీక్ నాయక్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు చిత్తూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ యూత్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టులో పాల్గొంటారు.

9న మండల సర్వసభ్య సమావేశం

నంబులపూలకుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 9న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీడీ అంజినప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని ఎంపీపీ రాము అధ్యక్షతన నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలోని కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని ఆలోచిస్తోందని, ఇటువంటి దుర్మార్గమైన ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, హైదర్‌వలీ, పారిశుధ్యకార్మికసంఘం నాయకులు బాబు, ముకుంద లక్ష్మీఓబుళేశు, ఇంజనీరింగ్ కార్మికసంఘం నాయకులు బొగ్గునాగరాజు, అనిల్, దస్తగిరి పాల్గొన్నారు.

6 నుంచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 6 నుంచి 9వ తేది వరకు 15వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ అసోషియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ సూర్యప్రకాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దివంగత వ్యాయమా ఉపాధ్యాయుడు ఊకా అశ్వర్థనారాయణ జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆయన వద్ద శిక్షణ తీసుకున్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారన్నారు. ఈ టోర్నమెంట్‌ను హాకీ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో, హాకీ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 22 జట్లు ఇందులో పాల్గొంటాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని, కావున క్రీడాకారులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నివాళి

తాడిమర్రి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు, తాడిమర్రి వాసి గణేశ్ తల్లి నారాయణమ్మ అనారోగ్యంతో సోమవారం మరణించారు. మంగళవారం ఆమె మృతదేహానికి టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, పలువురు నాయకులు నివాళులర్పించారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్.. గణేశ్‌ను ఫోన్‌లో పరామర్శించాడు.

నాటుసారా విక్రయిస్తే కేసులే..

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇక నాటుసారా విక్రయించిన.. నిల్వ ఉంచుకున్నా.. వారిపై కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారి గోవిందనాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ధర్మవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నవోదయ 2.0లో మొదటి దశలో భాగంగా అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చామని, ఇక రెండో దశలో కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట పుట్టపర్తి డీటీఎఫ్ హరికృష్ణ, ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐలు నాగరాజు, చాంద్‌బాషా ఉన్నారు.

కొండెక్కిన గ్రాసం ధరలు



గాండ్లపెంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశుగ్రాసం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వేసవిలో ఎక్కడ చూసినా గడ్డి ఎండి పోవడం, ఆపై నిప్పుపెట్టడం, పచ్చిక లేకపోవడంతో గ్రాసం ధర విపరీతంగా పెరిగింది. గతంలో వరిగడ్డి, వేరుశనగ కట్టె ఆకాల వర్షాల కారణంగా ఖరీఫ్‌లో తడిసిపోయింది. గ్రాసం పనికిరాకుండా పోవడంతో వదిలేశారు. దీంతో గ్రాసానికి డిమాండ్ పెరిగింది. రబీలో వేరుశనగ కట్టెకు డిమాండ్ పెరిగింది. ట్రాక్టర్ ధర రూ. 20వేల నుంచి రూ.25 వేలు పలుకుతోంది. దీంతో తప్పనిపరిస్థితుల్లో పశు యజమానులు రైతులు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకుంది. ప్రభుత్వం సబ్సిడీతో గ్రాసం, దానా పంపిణీ చేసి.. తమను ఆదుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ఉట్లమాను పరుష



ఉట్లమాను ఎక్కడానికి పోటీపడుతున్న యువకులు

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గమ్మ దేవాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఉట్లమాను పరుష ఉత్సాహంగా సాగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఉట్లమాను పరుషతో పాటు పలు పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉట్లమాను పరుష నిర్వహించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఉట్లమాను పోటీలో స్థానిక బోయవీధికి చెందిన బోయజనార్ధన్ విజేతగా నిలిచాడు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు అతనికి రూ.10,016 బహుమతిని అందజేసి.. అభినందించారు.



ప్రభుత్వ కళాశాలపై ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, కావున ఆ కళాశాల్లోనే చేరాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మీ తెలిపారు. మంగళవారం పదో తరగతి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థిలను కలిసి ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని, కళాశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించడంతోపాటు అందులో చదివిన విద్యార్థులకు అన్ని పథకాలు కూడా వర్తిస్తాయన్నారు. ఏటా తమ కళాశాల ప్రైవేటు కళాశాలల కంటే ఎక్కువ ఉత్తీర్ణత శాతాన్ని సాధిస్తోందన్నారు. ఆమె వెంట అధ్యాపకులు పెద్దన్న, హాజీపీరా, మల్లికార్జున, ప్రభాకర్ ఉన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తలుపుల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది మంగళవారం ప్రకటనలో తెలిపింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి తలుపుల ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని పేర్కొంది.

● ఓబుళదేవరచెరువు: స్థానిక వెంకటసాయి ఐటీఐలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్ట ఓబులరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ఇందులో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కూడా పాల్గొంటారని తెలిపారు. ఓడీచెరువు, నల్లమాడ, అమడగూరు మండలాల్లోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చి.. పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఎమ్మెల్యే పీఆర్‌ఓ ఎద్దుల సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఓడీసీ సంత వేలం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఓబుళదేవరచెరువు వారంపు సంత వేలాన్ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. వేలం పాటలో వారంపు సంత వేలానికి 31మంది పోటీ పడగా, ఆకుతోటపల్లికి చెందిన వై. చంద్రశేఖర్ రూ.3.64 లక్షలకు దక్కించుకున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు 33 మంది పోటీ పడగా, వసంతం భుజగంరావు రూ.1.84 లక్షలకు దక్కించుకున్నట్లు కార్యదర్శి శ్రీకాంత్ తెలిపార. వేలంలో ఎంపీడీఓ రాబర్టువిల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి పాల్గొన్నారు. కాగా, గురువారం కొండకమర్ల పంచాయతీ కార్యాలయంలో వారంపు సంత వేలం వేస్తామని ఈ సందర్భంగా కార్యదర్శి మద్దిలేటిరెడ్డి తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే

తనకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెట్ల తండాకు చెందిన రవీంద్రనాయక్ కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేశాడు. తనను ఆదుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేస్తుకున్నారు. దీంతో అతనికి రూ.1,30,518 మంజూరైంది. ఆ చెక్కును బాధితుడికి ఎమ్మెల్యే తన కార్యాలయంలో మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బీగం శంకర్‌నాయుడు, గిరిజన నాయకుడు శ్రీరాములనాయక్, గేమేనాయక్ తండా సర్పంచ్ మూడే కాంతమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైనింగ్ పనులను అడ్డుకున్న సీపీఎం నాయకులు



లైనింగ్ పనులను అడ్డుకుంటున్న నాయకులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొట్టాల సమీపంలో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను సీపీఎం, రైతు సంఘం నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు కాకుండా, కాలువ వెడల్పు చేయాలని, లైనింగ్ పనులు చేయడం వలన భూగర్భ జలాలు ఎండిపోతాయని, రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి ఉమ్మడి జిల్లాలో ఉన్న చెరువులన్నింటికి నేరుగా నీరు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, మారుతి మండల సీపీఎం కార్యదర్శి ఆటో పెద్దన్న, పోతలయ్య, పక్కీరప్ప, సుధాకర్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కొండలకు నిప్పు

గాండ్లపెంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీన్లకుంట, కోట్లపల్లి, ఎలుగూటివారిపల్లిలో ఆకతాయిలు మంగళవారం కొండలకు నిప్పు పెట్టడంతో రైతులు భయభ్రాంతలకు గురయ్యారు. కొండలచుట్టూ మంటలు వ్యాపించాయి. తాము సాగుచేసిన మామిడి, వివిధ రకాల పంటలు అగ్నికి ఆహుతి అవుతాయని రైతులు ఆందోళన చెందారు. ఆ మంటలు ఆర్పడానికి విఫలయత్నం చేశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో.. ఆ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని.. మంటలను అదుపు చేసింది.

నీటితొట్టెల నిర్మాణానికి భూమిపూజ

నల్లమాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పశువుల దాహార్తి తీర్చడానికి ఉపాధి హామీ పథకం కింద నీటితొట్టెల నిర్మాణానికి పలు గ్రామాల్లో మంగళవారం భూమిపూజ చేశారు. మండలంలోని ఎర్రకంపల్లిలో నీటితొట్టె నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లె సింధూరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే మండలంలోని ఎర్రవంకపల్లి, రెడ్డిపల్లి, నల్లశింగయ్యగారిపల్లి, ఎద్దుల వారిపల్లితండా, దొన్నికోట, పులగంపల్లి పంచాయతీల్లో పించన్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ఆజాద్, ఏపీఓ సూర్యనారాయణ, సర్పంచ్‌లు భారతి, ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశరెడ్డి, గడ్డం ర మణారెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

● గాండ్లపెంట : మండలంలో కటారుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 35 వేలతో పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏపీఓ మంజునాద్, ఈసీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మండలానికి 55 నీటితొట్టెలు మంజూరయ్యాయన్నారు. ఈ నీటి తొట్టెలను పశువైద్యాధికారి చెన్నకేశవులునాయక్ నిర్ణయించిన ప్రాంతంలో, పశువులకు అనుకూలమైన చోట నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అక్బర్, ఫీల్డ్ అసిస్టెంట్లు హేమంత్‌రెడ్డి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

● తనకల్లు: మండలంలోని మంగదిన్నెపల్లి గ్రామంలో పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టె నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఇందులో టీడీపీ కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ పూల రెడ్డెప్ప, ఏపీఓ మరియమ్మ, పశువైద్యాధికారి హరినాథ్‌రెడ్డి, జేఈ శ్రీనివాసరెడ్డి, సాంకేతిక సహాయకులు జనార్ధన్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో పశువుల నీటితొట్టెల నిర్మాణానికి ఎంపీడీఓ సాయిమనోహర్ భూమిపూజ చేశారు. మండలానికి 77 నీటితొట్టెలు మంజూరయ్యాయని, ఒక్కో దాన్ని రూ.33,220తో నిర్మిస్తామని తెలిపారు. ఈనెల 10 లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని, వెంటనే వారి ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళీ, టీపీ చంద్రకళ టీడీపీ నాయకులు దళవాయి కుళ్లాయప్ప, మాజీ సర్పంచ్ రమణ, ఏఫ్ఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● నంబులపూలకుంట : మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీడీఓ అంజనప్ప మంగళవారం భూమి పూజ చేశారు. 14 పంచాయతీల్లో 64 నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు, ఈఓఆర్డీ మాధవరెడ్డి, సర్పంచ్ విష్ణుమూర్తి, వెంకటనారాయణ పాల్గొన్నారు.



నల్లమాడ : ఎర్రవంకపల్లిలో నీటితొట్టె నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

ధర్మవరంరూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండ లంలోని చిగిచెర్ల గ్రామంలో శ్రీమారెమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పండుగ తర్వాత అమ్మవార్ల మూలవిరాట్‌ను ఆలయ పూజారి ఆకుపూజ, వేపమండలు, నిమ్మకా యలు, వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్దఎత్తున మహిళ భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకు న్నారు. రాత్రి భజన సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



నల్లగంగమ్మ

● తనకల్లు : మండలంలోని ముండ్లవారిపల్లి సమీపంలో వెలసిన నల్లగంగమ్మకు మంగళవారం నల్లగుట్లపల్లి, ము ళ్లోపల్లి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. మండలంలోని కట్ట కింద గంగమ్మ, బోడుగుండ్ల గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్య క్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో పెద్దమ్మతల్లి

● ముదిగుబ్బ : స్థానిక పాత వూరిలోని గ్రామదేవత పెద్దమ్మతల్లికి మంగళవారం భక్తులు జ్యోతులు, బోనాలు సమర్పించారు. తెల్లవారుజామున అమ్మవారికి వెండి ఆభరణాలు, బంతిపూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు పెద్దన్న, శివసాయి తెలిపారు. భక్తులు మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● బత్తలపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామదేవతలకు మంగళవారం బోనాలు సమర్పించారు. ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని వెంకటగారిపల్లిలో సత్యమ్మతల్లి, బత్తలపల్లిలో గంగమ్మతల్లి మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని అమ్మవార్లకు సమర్పించారు. మొక్కు బడులు చెల్లించారు.



అలంకరణలో సత్యమ్మ తల్లి

● ఓబుళదేవరచెరువు : మండలంలోని తుమ్మలకుంట్లపల్లి గ్రామ దేవత దండు మారెమ్మ గ్రామోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ పరష్కరించుకుని దండుమారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రంగులు చల్లుకుంటూ.. ఆనందోత్సాహాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.



దండు మారెమ్మ

క్రైం న్యూస్..

బైక్ బోల్తా - వ్యక్తి మృతి



పెద్ద రమణయ్య(ఫైల్)

కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి బోల్తాపడటంతో.. తలుపుల మండలం మూలపల్లి గ్రామానికి చెందిన పెద్ద రమణయ్య (55) మంగళవారం రాత్రి మరణించాడు. అతను బట్రేపల్లి నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై మంగళవారం రాత్రి బయలుదేరాడు. మూలపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలో వెళ్తున్న మహిళను తప్పించబోయి.. బైక్ అదుపుతప్పి.. కిందపడ్డాడు. చుట్టుపక్కల గ్రామాల వాసులు గుర్తించి.. అతన్ని వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అతన్ని బెంగళూరుకు తీసుకొని వెళ్తుండగా.. మార్గమధ్యలో మరణించాడు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలో నీరుకుంట్లపల్లి, నరసప్పగారిపల్లి గ్రామాల మధ్య రెండు ద్విచక్రవాహనాలు మంగళవారం రాత్రి ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. నరసప్పగారిపల్లికి చెందిన రెడ్డిశేఖర్, నారాయణస్వామి, రామాంజనేయులు వెళ్తున్న ద్విచక్రవాహనం.. తలుపుల మండలం గుండువారిపల్లికి చెందిన ఆంజనేయులు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

దాడికేసులో ముగ్గురి అరెస్టు

కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కళ్యాణమండపం వద్ద పార్కింగ్ బాయ్‌గా పనిచేస్తున్న కుట్టిమొద్దు సోముశేఖర్‌పై దాడి కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. సోముశేఖర్‌పై గాలివీడు కళ్యాణ్‌కుమార్ అలియాస్ కళా, మహమ్మద్‌జునేద్ అలియాస్ చుడి, పఠాన్ బాబాఫక్రుద్దీన్ అలియాజ్ బాబా దాడిచేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కదిరి-హిందూపురం రహదారి వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని కోర్టుకు హాజరు పరచగా.. కోర్టుకు వారికి 14రోజులు రిమాండ్ విధించి సబ్ జైలుకు పంపినట్లు చెప్పారు.

నలుగురి బైండోవర్

కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో మద్యం సేవించి, ఇతరులపై గొడవలకు వెళ్తున్న నలుగురిని మంగళవారం బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. గాజులవీధికి చెందిన వారికి.. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని, అనంతరం తహ సీల్దార్ మురళీక్రిష్ణ సమక్షంలో బైండోవర్ చేశామని అన్నారు. సంవత్సరం పాటు సత్ప్రవర్తనతో మెలిగి ఉండాలని, ఒక్కొక్కరు రూ.లక్షల పూచీకత్తులో విడుదల చేశామని పట్టణ సీఐ అన్నారు.

న్యూస్ బాక్స్

సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభం

రఘు, ఏడీఏ, విద్యుత్‌శాఖ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మడకశిర, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 23 సబ్‌స్టేషన్లు ఉన్నాయి, మరో రెండింటికి ప్రతిపాదనలు పంపాం. అవి మంజూరు అయ్యాయి. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.5కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయని విద్యుత్ శాఖ ఏడీఏ ఎం.రఘు తెలిపారు. ఆయన మంగళవారం ఆంధ్రజ్యోతి మాట్లాడారు.

ప్రశ్న: నియోజకవర్గంలో లోటల్టేజ్ సమస్య ఏయే మండలాల్లో ఉంది. నివారణకు ఏ చర్యలు చేపట్టారు?

జవాబు: మడకశిర నియోజకర్గంలో అగలి, రొళ్ల, గుడిబండ మండలాల్లో లోటల్టేజీ సమస్య ఉంది. 133కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

ప్రశ్న: నియోజకర్గానికి సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయా..?

జవాబు: నియోజకర్గానికి రెండు సబ్‌స్టేషన్‌లు మంజూరు అయ్యాయి. రంగనపల్లి, కేకే పాళ్యం గ్రామాల పరిధిలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు చేశారు.

ప్రశ్న: మడకశిర సబ్ డివిజన్‌లో వ్యవసాయ కనెక్షన్‌ల కోసం ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు: సబ్‌డివిజన్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్‌ల కోసం 1134 దరఖాస్తులు వచ్చాయి. ట్రాన్స్‌పార్మర్ల కోసం డీడీ రూపంలో డబ్బులు చెల్లించారు. రెండు వారాల్లో 100 ట్రాన్స్‌పార్మర్లను రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది.

ప్రశ్న: డివిజన్ పరిధిలో ఎన్ని కోట్ల దాకా విద్యుత్ బకాయిలు ఉన్నాయి?

జవాబు: నియోజకవర్గంలో రెండు కోట్ల దాకా విద్యుత్ బకాయిలు ఉన్నాయి.

ఉగాది క్రికెట్ టోర్నీ విజేత ఫ్రెండ్స్ లెవెన్



ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది క్రికెట్ టోర్నీ విజేతగా ఫ్రెండ్స్ లెవెన్ జట్టు నిలిచింది. మండలంలోని గౌడనహళ్లి ఉన్నత పాఠశాల మైదానంలో టోర్నీ సాగింది. ఫైనల్స్‌లో ఫ్రెండ్స్ లెవెన్ జట్టుతో స్టార్ లైట్ స్ట్రైకర్స్ జట్టు స్టార్ లైట్ స్ట్రైకర్స్ జట్టు పోటీపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన 87 పరుగులు చేయగా ఫ్రెండ్స్ లెవెన్ జట్టు 90 పరుగులుచేసి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు నిర్వాహకులు నరేష్, భార్గవ్, హరీష్, నరేష్ తదితరులు బహుమతులను అందజేశారు.

అందరి సహకారంతో అవకాశం



అశ్వత్థనారాయణ రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకులు, కార్యకర్తలు సహకారంతోనే తనకు మార్కెట్ యార్డ్ చైర్మన్ అవకాశం దక్కిందని అశ్వత్థనారాయణరెడ్డి అన్నారు. అశ్వర్థనారాయణరెడ్డికి కొటిపిలో అరుణాచల్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి తదితరులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు అరుణాచల్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాంచజన్య విద్యార్థిని ప్రతిభ

జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం



అలిషా

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన అనాలిటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో పట్టణంలోని పాంచజన్య పాఠశాల విద్యార్థిని అలిషా ప్రథమస్థానం దక్కించుకుంది. గత ఏడాది అక్టోబరు, నవంబరులో నిర్వహించిన టెస్ట్‌లో అలిషా రాణించింది. దీంతో ఆ అలిషాను ఏడీ స్మిత, కరస్పాండెంట్ నందకుమార్, హెచ్‌ఎం. గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్‌ఎం శశికళ, సతీష్‌కుమార్, రజాక్ తదితరులు అభినందించారు.

మద్యం మత్తులో ఘర్షణ

ఇరువురికి గాయాలు

సోమందేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణకు దిగిన ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చౌడేశ్వరి అమ్మవారి పంచమ జ్యోతుల ఉత్సవం సందర్భంగా మార్కెట్ రోడ్డులో నవరత్నాలు నాటకం వేశారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. చికిత్స నిమిత్తం వారిని ఆసుపత్రిలో చేర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సయ్యద్‌యాసిన్, నవీన్ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. గోరంట్లలోని 1వ వార్డుకు చెందిన సయ్యద్‌యాసిన్, రాజీవ్‌కాలనీకి చెందిన నవీన్ ద్విచక్రవాహనంలో మంగళవారం వెళ్తున్నారు. బస్టాండ్ కూడలి వద్ద మరో వాహనాన్ని తప్పించే సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

ఆధార్ అప్‌డేట్‌కు తప్పని నిరీక్షణ

పోస్టల్ డిపార్టుమెంట్‌కు మాత్రమే అనుమతి

ఉదయం 5 గంటల నుంచే క్యూ

రోజుకు 50 మాత్రమే అప్‌డేట్



ఉదయం నుంచే క్యూలో ఉన్న ప్రజలు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్ తప్పని సరి చేసింది. దీంతో విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ ఉంటేనే తల్లికి వందనం, ఇతర పథకాలు అందుతాయి. లేకుంటే ప్రభుత్వ పథకాలు అందవు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం అపార్ తీసుకొచ్చింది. దీనికి సైతం ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి చేసింది. ఈ ఆధార్ అప్‌డేట్‌ను కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖకు అప్పగించింది. పోస్టాఫీస్‌లో మాత్రమే అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల అప్‌డేట్ చేస్తున్నారు. రోజూ 50 వరకు మాత్రమే అప్‌డేట్ అవుతున్నాయి. హిందూపురంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలవాసులు కూడా పోస్టాఫీసుకు ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లాల్సి వస్తోంది. దీంతో రోజూ ఎక్కువ సంఖ్యలో పోస్టాఫీసుకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ శాఖవారు టోకన్లను జారీ చేసి ఫలానా తేదీన రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. టోకన్ల కోసం ఉదయం 5 గంటల నుంచే పోస్టాఫీసు వద్దకు చేరుకుంటున్నారు. వద్దని తపాలాశాఖ సిబ్బంది 9 గంటలకు రావాలని చెబుతున్నా క్యూలైన్ పెరుగుతుందని, అందుకే తాము ఉదయమే కార్యాలయం వద్దకు చేరుకుంటున్నామని చెబుతున్నారు. అసలే ఎండాకాలం. క్యూలో నిలుచోవాలి. లేనిపక్షంలో టోకన్ దక్కదు. ఇతర ప్రాంతం నుంచి వస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టోకన్ దక్కకపోతే ఆధార్ అప్‌డేట్ కాదు. ఆధార్‌తోనే అపార్ అవుతుంది. అప్పుడే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. దీంతోనే తాము ఇబ్బందులు ఎదుర్కొని ఆధార్ అప్‌డేట్ కోసం వస్తున్నామని లబ్ధిదారులు అంటున్నారు. తమ ఇబ్బందులు తొలగాలంటే మరికొన్ని ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఉదయం 5 గంటల నుంచి వేచి ఉన్నా..



తన ఇద్దరు పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉంది. గత వారం ఆధార్ అప్‌డేట్ కోసం పోస్టాఫీస్‌కు వస్తే పెద్దఎత్తున క్యూలైన్‌లో జనాలు ఉన్నారు. ఎంత ప్రయత్నించినా ఆ రోజు నాకు కనీసం టోకన్ దక్కలేదు. దీంతో మంగళవారం తెలవారు 5 గంటల నుంచే క్యూలైన్‌లో నిలుచున్నాను. ఒక్కొక్కరికి ఒక్క టోకనే ఇస్తామంటున్నారు.

- లక్ష్మీనారాయణ, కొట్నూరు

మరి కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది

ఆధార్ అప్‌డేట్, పేరు మార్పులు, తదితర వాటికి పోస్టల్ డిపార్టుమెంట్ వారికి అనుమతులు ఇచ్చారు. నెట్ సర్వీసులు సరిగా పనిచేయకపోవడం, ఆధారాలు సరిగా లేకపోవడం, పరికరాలు నెమ్మదిగా పనిచేయడం తదితర సమస్యలతో ఆలస్యం అవుతుంది. మాతో పాటు మరి కొన్ని కేంద్రాలు లేర్పాటు చేస్తే బాగుంటుంది, లేదా సచివాలయాలకు ఈ పని అందిస్తే వేగవంతంగా అవుతుంది. ఆయా సచివాలయాల పరిధిలో వారు వెళ్ళి చేసుకుంటే వేగవంతంగా అవుతుంది.

- మార్కండేయులు, పోస్ట్ మాస్టర్

పేదల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో మంగళవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు అందజేయనున్నామన్నారు. తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాలోకి మే నెలలోపు జమచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గుడిబండ(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్.రాయాపురం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నిరుపేద ప్రజలకు ఇళ్లు, పింఛన్లు, గ్రామాల్లో మౌలిక వసతులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్య, తాగునీటి సమస్య, పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ఎస్.రాయాపురం గ్రామంలో శోత్రియం భూముల్లో సాగుచేసుకొంటున్న రైతులకు రైత్వారీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించేందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీఓలను, తహసీల్దార్‌లను గ్రామానికి పిలిపించి రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు. పింఛన్ల లబ్ధిదారులకు ఎన్‌టీఆర్‌భరోసా పింఛన్లను అందించారు. పశువులకు తాగునీటి కోసం తొట్టెల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎంపీడీఓ గంగాధర్, నాయకులు లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

తొట్టెల నిర్మాణానికి భూమిపూజ

ఉపాధి హామీ పథకం కింద నియోజకవర్గంలోని ఐదు మండలాలో పశువుల నీటి తొట్టెలను నిర్మిస్తున్నాట్లు ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు తెలిపారు. మంగళవారం యా రంగాపురం గ్రామ సమీపంలో పశువుల తొట్టెల నిర్మాణానికి భూమి పూజచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనియా బాయి, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మహత్య బాధాకరం

మడకశిర పట్టణంలోని గాంధీబజార్‌లో కృష్ణాచారి కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కృష్ణాచారి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

స్టోర్ డీలర్ల సమస్యలపై సమావేశం

మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డీఎస్‌ఓ వంశీకృష్ణతో డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. సమస్య పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకొంటామని డీఎస్‌ఓ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

తెగిన హంద్రీ నీవా కాలువ

- పంట పొలాలను ముంచెత్తిన నీరు



పొలాల్లోకి వెళ్తున్న కాలువ నీరు



తెగిన కాలువ

సోమందేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో మంగళవారం హంద్రీనీవా కాలువ తెగిపోవడంతో నీరు పక్కనే ఉన్న పంట పొలాలను ముంచెత్తింది. వరి పంట నీట మునిగింది. దీంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. సమాచారం అందుకున్న హంద్రీనీవా సృజల స్రవంతి ఈఈ శ్రీనివాసులు, ఏఈలు వంశీ, ప్రదీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న మడకశిర బ్రాంచ్ కెనాల్ సరఫరా విభాగంలో మోటార్‌లు ట్రిప్ అయ్యాయని, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించామన్నారు. నీటిని నియంత్రించలేకపోయామన్నారు. ఒక్కసారిగా ఫ్లో పెరగడంతో సోమందేపల్లి మండలం 47.5 కిలో మీటర్ వద్ద బలహీనంగా ఉన్న కట్ట తెగిపోయిందన్నారు. వెంటనే బ్రాంచ్ కెనాల్ వద్ద మరమ్మతులను పూర్తి చేసి పరిస్థితిని చక్కదిద్దామన్నారు. కాలువ తెగిన విషయాన్ని తెలుసుకొని పంప్ హౌస్‌లో సరఫరాను నిలిపి వేశామన్నారు. నీటి ప్రవాహం తగ్గగానే బుధవారం ఉదయం కాలువ మరమ్మతులను చేపడతామన్నారు.

లీటరుకు రూ.4 మద్దతు ధర

- తుమల్ అధ్యక్షుడు హెచ్‌వీ వెంకటేష్

పావగడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను అన్ని విధాలుగా ఆదుకొనేందుకు ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగానే ఏప్రిల్ నుంచి పాలపై లీటరుకు రూ.4 చొప్పున మద్దతుధర ప్రకటించి ఖాతాకు జమ చేస్తున్నట్లు తుమల్ అధ్యక్షుడు, పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ తెలియజేశారు. మంగళవారం తుమకూరులోని తుమల్ కార్యాలయంలో డైరెక్టర్ల సమావేశంలో మాట్లాడారు. జనవరి, ఫిబ్రవరి నెలలో ఎండ తీవ్రతకు పాల ఉత్పత్తి తక్కువ అయిందని, దీని వల్ల తుమకూరు జిల్లావ్యాప్తంగా రూ.4.21కోట్లు తుమల్ కార్యాలయానికి నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తుమల్ డైరెక్టర్ల విన్నపం మేరకు ఏప్రిల్ నుంచి పాడిరైతుల అభివృద్ధికి లీటరుకు రూ.4 చొప్పున జమ చేస్తున్నట్లు వివరించారు. రైతుల అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, సహకార మంత్రి కె.ఎం.రాజన్న, పాడిపశువుల శాఖ మంత్రి కె.వెంకటేష్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తుమల్ డైరెక్టర్లు భారతీదేవి, ఎం.కె.ప్రకాష్, నాగేష్‌బాబు, ఎస్.ఆర్.గౌడ, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రైతుల అభివృద్ధికి కావాల్సిన అంశాలపై చర్చించారు.



మాట్లాడుతున్న హెచ్‌వీ వెంకటేష్

ఏజీపీగా గోవిందప్ప

మడకశిర రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మడకశిర కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న గోవిందప్పను ప్రభుత్వం ఏజీపీగా నియమించింది. ఈ సందర్భంగా గోవిందప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏజీపీగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తొట్టెల నిర్మాణానికి భూమిపూజ

అమరాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసవనపల్లిలో ఏపీఓ జగదీశ్, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పశువుల తాగునీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ పశువుల నీటి తొట్టెలు మండలానికి 40 మంజూరయ్యాయన్నారు. ఏప్రిల్ 10వతేదీలోపు అన్ని నిర్మాణాలు పూర్తి చేసి పైప్‌లైన్ ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చేవిధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యమ్మ, నరసింహప్ప, జేఈ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగరాజు, ముద్దరాజు, స్థానిక నాయకులు పరమేశ్వరప్ప, శివకుమార్, డీలర్లు మోహన్‌కుమార్, రంగస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వైభవంగా చౌడేశ్వరి రథోత్సవం

హిందూపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటీపీలో వెలసిన చౌడేశ్వరీ మాత బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి ప్రదక్షిణలు చేసిన అనంతరం రథం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి అధిష్ఠింపజేశారు. .అమ్మవారి నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య అమ్మవారి రథోత్సవం ముందుకు కదలింది. అంతకు ముందు మహిళలు బియ్యం పిండితో ప్రత్యేకంగా చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కొటిపి గ్రామం భక్తులతో కిక్కిరిసింది. సీఐ ఆంజినేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సవిత



సోమందేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఊరిలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారిని మంగళవారం బీసీ, జౌళి చేనేతశాఖ మంత్రి సవిత దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఈశ్వరయ్య జ్యోతి కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం మూల విరాట్‌ను దర్శించుకున్నారు.

ఘనంగా పంచమజ్యోతుల మహోత్సవం

సోమందేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంచమ జ్యోతులు మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం తెల్లవారు జాము నుంచి జ్యోతులను పట్టణ వీధుల్లో ఊరేగింపుగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ వారు ఊరేగింపుగా తీసుకెళ్తుంటే భక్తులు జ్యోతులతో వెంట నడిచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య, తొగట వీర క్షత్రీయ సంఘం అధ్యక్షుడు డీసీ హరి పాల్గొన్నారు.

చౌడేశ్వరీ మాతకు నవమ జ్యోతుల ఉత్సవం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రీయుల ఆరాధ్యదైవం శ్రీ చౌడేశ్వరీమాత అమ్మవారి నవమ జ్యోతుల ఉత్సవం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు జ్యోతులతో నృతాలతో చేశారు.

మల్లాలమ్మకు జ్యోతుల సమర్పణ



గోరంట్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేదరకులస్థులు మూడేళ్లకొక్కమారు జరుపుకునే మల్లాలమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలిసిన తుమ్మలమారమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

సిగ్నల్ అందక ఇబ్బందులు

పింఛన్, రేషన్ కోసం తప్పని తిప్పలు

రొళ్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లినమడుగు గ్రామంలో పింఛన్, రేషన్ తీసుకోవాలంటే రోజంతా వేచి చూడాల్సిందే. బయోమెట్రిక్ సిగ్నల్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సి రావడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా పింఛన్, రేషన్ పొందాలంటే బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో గంటల తరబడి సిగ్నల్ కోసం వేచి చూడాల్సి వస్తోందని అంటున్నారు. ఇళ్ల వద్దకు పింఛను అందించాల్సి ఉండగా బయోమెట్రిక్ సిగ్నల్ కారణంగా అందరికీ ఒకే చోట అందిస్తున్నారు. అయినా సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పింఛను కోసం ఎక్కడ సిగ్నల్ వస్తుందో అక్కడ నిలబడి తీసుకోవడం జరుగుతోందని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బయోమెట్రిక్ సిగ్నల్ సక్రమంగా అందేవిధంగా చూడాలని పింఛన్, రేషన్ లబ్ధిదారులు కోరుతున్నారు.



పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు